క్లుప్తంగా

భక్తితోనే శాంతి మార్గం

ఎమ్మెల్యే మాణిక్‌రావు



పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పస్తాపూర్ అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం పడి పూజ ఘనంగా నిర్వహించారు. రామకృష్ణరెడ్డి, రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పడిపూజకు ఎమ్మెల్యే మాణిక్‌రావు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భక్తితోనే శాంతి మార్గం లభిస్తుందని, ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలన్నారు. అయ్యప్పస్వామి ఆశీస్సులతో అందరూ సుఖశాంతులతో ఉండాలన్నారు. అయ్యప్పస్వామి ఆలయాభివృద్ధికి గతంలో మాజీ మంత్రి హరీశ్‌రావు రూ.15 లక్షలు నిధులు మంజూరు చేశారు. కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతూ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తట్టునారాయణ పాల్గొన్నారు.

శ్రీనివాసమూర్తికి సన్మానం



శ్రీనివాసమూర్తిని సన్మానించిన భక్తులు

సదాశివపేట(సంగారెడ్డి): ఢిల్లీలో గౌరవ డాక్టరేట్ పట్టా అందుకున్న పట్టణానికి చెందిన దైవజ్ఞ శ్రీనివాసమూర్తిని ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాలుగా జ్యోతిష్య వాస్తు, శాస్త్రాలపై చేస్తున్న పరిశోధనలు, విశేష సేవా కార్యక్రమాలకు గౌరవ డాక్టరేట్ అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సత్సంగ్ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

రగ్గులు పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న కుమార్ తదితరులు

నారాయణఖేడ్: చలి తీవ్రత బాగా పెరిగినందున వసతిగృహాల విద్యార్థులకు రగ్గులు, స్వెట్టర్లను పంపిణీ చేయాలని అఖిలభారత ప్రజాతంత్ర్య విద్యార్థి సమాఖ్య ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్ తెంకటి కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం ఖేడ్‌లో నిర్వహించిన సంఘం డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మారినా వసతిగృహాల విద్యార్థులకు మాత్రం తిప్పలు తప్పడం లేదన్నారు. చాలా వసతిగృహాలకు కిటికీలు, తలుపులు సక్రమంగా లేక చలితీవ్రతకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కిటికీలకు మరమ్మతులు చేయించాలన్నారు. సంఘం డివిజన్ నాయకులు పవన్, సురేష్, మహేందర్, రాకేష్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు పరిశీలిస్తున్న వైస్ చైర్మన్ శంకర్

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డుకు సంబంధించిన ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట్‌లో ఆదివారం సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ పనులను పరిశీలించి, నాణ్యత పాటించాలని సూచించారు. సీసీ రోడ్డు లేకపోవడంతో మంగల్‌పేట్‌లోని పలు కాలనీవాసులు వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పనులు ప్రారంభం కావడంతో ఆయా కాలనీవాసులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

వాటర్ ట్యాంకర్ టైర్లు చోరీ



వాటర్ ట్యాంకర్

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని రంగరాముల గుట్ట వద్ద నిలిపి ఉంచిన గ్రామపంచాయతీ వాటర్ ట్యాంకర్ టైర్లను శనివారం గుర్తు తెలియని దుండగులు దొంగిలించారు. గతంలో కూడా రైతు వేదిక వద్ద బోర్ మోటార్ దొంగిలించినట్లు పంచాయతీ సెక్రటరీ మాణిక్యం తెలిపారు.

ప్రకృతి వనం.. నిర్వహణ అధ్వానం

- అధికారుల నిర్లక్ష్యం వల్ల అస్తవ్యస్తం
- పేటలో జనాలు లేని ప్రకృతి వనాలు



కశెట్టి వెంచర్ ప్రకృతి వనం

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణ ప్రజలకు ఆహ్లాదంతో పాటు మానసిక ప్రశాంతత, స్వచ్ఛమైన గాలి అందించాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వం లక్షలు వెచ్చించి పట్టణ ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. అయినా ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదు. ఆహ్లాదాన్ని నింపేలా, సేద తీరేలా, సుందరీకరణ, పండ్లు, నీడనిచ్చే మొక్కలు నాటాలని ప్రణాళికను సిద్ధం చేశారు. మొక్కలు నాటాలని అధికారులకు టార్గెట్‌లు పెట్టడంతో నర్సరీల్లో ఉన్న మొక్కలను తీసుకువచ్చి పట్టణ ప్రకృతి వనాల్లో నాటారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా రూ.16లక్షలపై చిలుకు నిధులతో ఏర్పాటు చేసినా మెయింటెనెన్స్ లేక అధ్వానంగా మారాయి. వనాలను పట్టించుకునే వారే కరువయ్యారు. నిధులు వృథాకావడంతో పాటు ప్రజలకు ఆహ్లాదం దూరమవుతుంది. సదాశివపేట మున్సిపాలిటీ పరిధిలోని వెంచర్ల పార్కుల స్థలాలతో పాటు ప్రభుత్వ స్థలాల్లో పట్టణ ప్రకృతి వనాలు ఏర్పాటు చేసేందుకు హడావుడి చేసిన అధికారులు వాటి నిర్వహణ మాత్రం గాలికి వదిలేశారు.

12 ప్రకృతి వనాలు ఏర్పాటు

పట్టణ పరిధిలో 12 ప్రకృతి వనాలు ఏర్పాటు చేయడంపై ఉన్న శ్రద్ధ వాటి మెయింటెనెన్స్‌పై మాత్రం చూపడం లేదు. సిద్దాపూర్ డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద రెండు ఎకరాల ప్రభుత్వ స్థలంలో ప్రకృతి వనాలు ఏర్పాటు చేసినా నిర్వహణ మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రజలు కూర్చునేందుకు, వాకింగ్ చేసేందుకు వాక్ ట్రాక్‌ను ఏర్పాటు చేయలేదు. వీటికి తోడు ప్రకృతి వనాలకు ఎప్పుడు తాళాలు వేసి ఉండటంతో ప్రజలు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. పట్టణంలోని పద్మావతి వెంచర్, కశెట్టి వెంచర్, సిద్దాపూర్ హౌజింగ్‌బోర్డు కాలనీ, ఎస్ గార్డెన్ వెంచర్, సాయి వెంచర్, త్రిబుల్ ఐటి వెంచర్, ఇదుల వాగు వెంచర్, స్లాటర్ హౌజ్, ఫైలింగ్ సెక్షన్ అన్ని ప్రకృతి వనాల గేట్లకు తాళం వేశారని సమాచారం.

వనాల సంరక్షణపై శ్రద్ధ లేదు

ప్రజలకు పచ్చదనం, ఆహ్లాదం అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతి వనాలు అధికారులు నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతుంది. మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతి వనాల సంరక్షణకు తగు చర్యలు తీసుకోవాల్సి ఉన్నా వాటి వైపు కన్నెత్తి చూడకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగి, అస్తవ్యస్తంగా మారుతున్నాయి.



పట్టణ ప్రకృతి వనంలో ఎండిపోయిన మొక్కలు

> **చర్యలు చేపడతాం**
>
> పట్టణంలోని వెంచర్లు, ప్రభుత్వ స్థలాల్లో 12 ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించి వాటిని వినియోగంలోకి తెచ్చేలా అవసరమైన చర్యలు చేపడతాం.
>
> – రాజేష్ ఇంజనీర్ సదాశివపేట

జగ్గారెడ్డి దంపతులకు సన్మానం



జగ్గారెడ్డి దంపతులను సన్మానించిన సభ్యులు

సంగారెడ్డి: సంగారెడ్డిలోని బ్రాహ్మణ సమాజం సేవా సంస్థకు రూ. 5లక్షల ఇస్తానని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ప్రకటించారు. సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అష్టోత్తర శత సామూహిక శ్రీ సత్యనారాయణ వ్రతాలు, మాతా పితృ వందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన జగ్గారెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న వారిని సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు.

తెలంగాణలోనూ జెండా ఎగరేస్తాం



మాజీ ఎంపీ బీబీ పాటిల్‌కు స్వీట్లు తినిపిస్తున్న నాయకులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపొందిన సందర్భంగా సంబురాలు నిర్వహించారు. ఆదివారం మహారాష్ట్ర విజయ మహోత్సవ కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తున్న జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్‌కు స్వాగతం పలికారు. 5 స్థానాల్లో గెలుపునకు కృషి చేసిన సందర్భంగా న్యాల్‌కల్ మండల అధ్యక్షుడు ఓంకార్ యాదవ్ బీబీ పాటిల్‌ను సన్మానించి, స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా న్యాల్‌కల్ బీజేపీ మండల అధ్యక్షుడు ఓంకార్ యాదవ్ మాట్లాడుతూ.. బీజేపీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేసిన మహారాష్ట్ర ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మల్లేశ్, గంగ్వార్ ఎస్ ఆరుణ్‌కుమార్, చందు, మల్లప్ప పాటిల్, సిద్ధారెడ్డి, పాండు పటేల్, సాయికుమార్, ఓనంరెడ్డి, శరణప్ప తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతను దెబ్బతీయడానికే వర్గీకరణ

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్



పాదయాత్ర చేస్తున్న మాల మహానాడు నేతలు

రామాయంపేట(మెదక్): దళితుల మధ్య ఐక్యతను దెబ్బతీయడానికే ఎస్సీ వర్గీకరణ అంశాన్ని తెరపైకి తెచ్చారని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాదయాత్ర ఆదివారం రామాయంపేట చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసే మొదటి రాష్ట్రం తెలంగాణే అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని తప్పుబట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ అంశాన్ని విరమించుకోవాలని, లేకపోతే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. అంతకుముందు సిద్దిపేట జిల్లా నుంచి మెదక్ జిల్లాలో ప్రవేశించిన పాదయాత్రకు సంఘం కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అలాగే, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యూనివర్సిటీ నాయకులు, కుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సంగారెడ్డి: పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సంగారెడ్డి: జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాల చౌటకూర్‌లో ఆదివారం 2009–2010 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆరు నుంచి పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు 14 ఏళ్ల తర్వాత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒక్కచోట కలుసుకుని ఒకరికొకరు , పరిచయం చేసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నా రు. చదివిన బడి, పరిసరాలను చూసి భావోద్వేగానికి గురయ్యారు. నాడు గురువులు నేర్పిన క్రమశిక్షణ, చదువుతో ఈరోజు వివిధ స్థాయిల్లో ఉన్నామని తెలిపారు. గురువులు కలిసి ఆటపాటలతో వి ద్యార్థులు సందడి చేశారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక



మునిపల్లి(అందోల్): ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

మునిపల్లి(అందోల్): పదవ తరగతి 2007–08 సంవత్సరానికి సంబంధించిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. మండలంలోని తాటిపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికలో భాగంగా ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. ప్రధానోపాధ్యాయులు నర్సయ్య విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. 16 సంవత్సరాలు గడిచినా తమను గుర్తు పెట్టుకుని సన్మానించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మర్చిపోలేని జ్ఞాపకాలను కల్పించేది బాల్యం అన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలతో సమావేశం



మహిళలతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్లు

కొండాపూర్(సంగారెడ్డి): మండలంలోని మల్లెపల్లిలో ఆదివారం ట్రైనీ కలెక్టర్లు మహిళా సంఘాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళా సంఘాల్లో ఎలా రుణాలు తీసుకుంటున్నారు. ఏ విధంగా చెల్లిస్తున్నారు. ఎంత రుణం తీసుకుంటే నెలనెల ఎంత చెల్లిస్తున్నారు. ఒక గ్రూపులో ఎంత మంది సభ్యులు ఉంటారు. పావులా వడ్డీ వస్తుందా రావడం లేదా అనే విషయాలను మహిళా సంఘాల సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెలనెల క్రమం తప్పకుండా మహిళా సంఘాల సభ్యులు డబ్బులు చెల్లిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతుండటంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఎస్సీ బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు విద్య బోధన గురించి తెలుసుకున్నార. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అంకుశ్‌మంగల్, దీక్ష, మేనఘ, సచిన్ చౌబాతో పాటు మహిళా సంఘాల సభ్యులు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఖేడ్‌లో కాంగ్రెస్ నాయకుల సంబురాలు



సంబరాల్లో పార్టీ శ్రేణులు

నారాయణఖేడ్: మహారాష్ట్రలోని నాందేడ్ ఎంపీ స్థానం ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుపై ఖేడ్‌లో ఆదివారం కాంగ్రెస్ నాయకులు సంబురాలు నిర్వహించారు. నాందేడ్ పార్లమెంటు స్థానానికి ఉపఎన్నిక జరగగా జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ ఆ స్థానానికి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఉపఎన్నికల కాంగ్రెస్ అభ్యర్థి బలవంత్ రవీందర్ చౌహాన్ విజయం సాధించడంతో పాటు కేరళలోని వయనాడ్ పార్లమెంటు స్థానం నుంచి ఉప ఎన్నికలో ప్రియాంక గాంధీ ఘన విజయం సాధించారు. ఝార్ఖండ్‌లో కాంగ్రెస్ కూటమి విజయం నేపథ్యంలో ఖేడ్‌లో కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు నిర్వహించాయి. షెట్కార్ ఇంటి ఎదుట బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో రాహుల్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఖేడ్, నాగల్‌గిద్ద మండలాల కాంగ్రెస్ అధ్యక్షుడు తాహెర్‌అలీ, మాణిక్‌రావు, మాజీ జెడ్పీటీసీ చందర్ నాయక్, నారాయణరెడ్డి, జ్ఞాన్‌రెడ్డి, బక్షీరాం, వైజ్యనాథ్‌పటేల్, హవప్ప, రాజు పాల్గొన్నారు.

దైవచింతనతోనే మానసిక ప్రశాంతత

హైకోర్టు న్యాయవాది మౌనిక



మాట్లాడుతున్న న్యాయవాది మౌనిక

పటాన్‌చెరు టౌన్: దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని హైకోర్టు న్యాయవాది సుంకరి మౌనిక అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని కోదండ సీతారామస్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులతో కలిసి హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... దేవాలయాలకు వచ్చే భక్తులు సంప్రదాయ వస్త్రాలు ధరించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలలో దేశభక్తిని పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో హనుమాన్ చాలీసా పారాయణ కమిటీ సభ్యులు శేషాద్రి, న్యాయవాది నాగరాజు యాదవ్, రామచంద్రుడు, రవి, బజరంగదళ్ కార్యకర్తలు మనోజ్, శిరీష్ ,భరత్, సూరజ్, నాగరాజు బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గుప్తా, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నరేష్, జగన్ రెడ్డి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన విశ్వపాళిని ఉత్సవాలు

కల్హేర్(నారాయణఖేడ్): బల్కంచెల్క తండా (భక్తిధాం)లో విశ్వపాళిని భవాని సమేత సేవాలాల్ మహరాజ్ మహా మందిరంలో ద్వాదశ వార్షికోత్సవ ముగింపు ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మేడ్చల్ జిల్లా రవాణా శాఖ అధికారి, మందిరం ధర్మకర్త మూడ్ కిషన్‌సింగ్ లలిత దంపతుల ఆధ్వర్యంలో అష్టోత్తర సహస్ర దీపాలంకరణ, పవళింపు సేవ, పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కిషన్‌నాయక్, తండా వాసులు శంకర్, ఖాత్రోత్ జైల్‌సింగ్, రాములు, రూప్‌సింగ్, కె.కిషన్, సవాయ్‌సింగ్, మన్మోహన్‌సింగ్, జైపాల్, గోవింద్ పాల్గొన్నారు.

నవ వరుడు ఆత్మహత్య

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మానసిక వేదనతో నవవరుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన బెల్ కాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. బెల్ కాలనీలో నివసించే నరసింహ(36) వెల్డర్‌గా పనిచేస్తున్నారు. కాగా నెల 10న సోలాపూర్‌కు చెందిన జయశ్రీతో వివాహం జరిగింది. పెళ్లి జరిగినప్పటి నుంచి ఇరువురు గొడవ పడుతుండటంతో భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో నరసింహ తీవ్ర మానసికవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో తాను పనిచేసే దుకాణంలోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. మృతిడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అందుబాటులో వరి విత్తనాలు

శివ్వంపేట (నర్సాపూర్): శివ్వంపేట ప్రాథమిక సహకార సంఘంలో వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పీఏసీఎస్ చైర్మన్ వెంకటరామిరెడ్డి ఆదివారం తెలిపారు. రైతులకు కావాల్సిన సన్న రకం, దొడ్డు రకం వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సన్న రకం ధాన్యానికి సంబంధించి 15 కిలోల బస్తాలు ఆర్‌ఎన్‌ఆర్, జేజీఎల్, 1010 రకం అందుబాటులో ఉన్నాయన్నారు. బస్తా ధర రూ.700 అని తెలిపారు. దొడ్డు రకం కేఎస్‌ఎమ్ 118.. 25 కిలోల బస్తా ధర వెయ్యి రూపాయలని చెప్పారు.

నూతన బజరంగ్ దళ్ కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

సంగారెడ్డి: చౌటకూర్ మండల బజరంగ్ దళ్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. మండల సంయోజక్‌గా కోర్పోల్ గ్రామానికి చెందిన చల్లా వినోద్ కుమార్, సహ సంయోజక్‌గా అంగడిపేట గ్రామానికి చెందిన శ్రీకాంత్, మండల గోరక్ష ప్రముఖ్ చంద్రశేఖర్, కోర్పోల్ గ్రామ ప్రముఖ్‌గా మన్నె మల్లేశం, సహ ప్రముఖ్‌గా మహేందర్‌లను సంగారెడ్డి జిల్లా బజరంగ్ దళ్ సంయోజక్ ప్రభుకుమార్ గౌడలను నియమించారు.

అనాథ విద్యార్థులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న పూర్వవిద్యార్థులు

రామచంద్రాపురం (పటాన్‌చెరు): తెల్లాపూర్‌లోని జిల్లాపరిషత్ పాఠశాలకు చెందిన 2004 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థులు అమీన్‌పూర్‌లోని అనాథ ఆశ్రమంలోని విద్యార్థులకు ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ.. తమ స్నేహితుడి పుట్టినరోజు సందర్భంగా డబ్బులను వృథా చేయకుండా అనాథ ఆశ్రమంలోని విద్యార్థులకు అన్నదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. సామాజిక సేవలో ఎంతో ఆనందం ఉందన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మహాసభలను జయప్రదం చేయండి

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. స్థానిక పరిశ్రమల్లో స్థానికులకే 90 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. వచ్చే ఏడాది జనవరి 25నుంచి 28 వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో మహాసభలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

◆ 29న ఆంజనేయ ఆలయ వార్షికోత్సవం

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణంలోని కల్పనా హనుమాన్ ఆలయ వార్షికోత్సవ వేడుకలను ఈనెల 29న నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం ఘటాభిషేకం, చందనోత్సవం, ఉమామహేశ్వర కల్యాణంతో పాటు సా.6 గంటల నుంచి కార్తీక మాస దీపోత్సవ కార్యక్రమం, మహాప్రసాద వితరణ, తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకొని ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఆయన సతీమణి అనుపమ రెడ్డి, కుటుంబ సభ్యులు మహాప్రసాదాన్ని అందిస్తారని వివరించారు.

◆ శబరిమలకు బయలుదేరిన స్వాములు

సంగారెడ్డి: చౌటకూర్‌లో వీరన్న గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములు ఆదివారం శబరిమలకు బయలుదేరారు. హనుమాన్ దేవాలయంలో పూజలు నిర్వహించి ఇరుముడిని తీసుకుని శబరిమలైకు బయలుదేరారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, కుటుంబ సభ్యులు, ఇతర భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

◆ ఓటరుగా నమోదు చేసుకోండి



సంగారెడ్డి టౌన్: 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరు ఓటర్ నమోదు చేసుకోవాలని సంగారెడ్డి ఆర్డీఓ రవీందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పసల్వాది గ్రామంలో ఓటరు నమోదు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్ నమోదుపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఓటర్ నమోదులో సవరణలు కూడా చేసుకోవచ్చని సూచించారు. అనంతరం కొత్త ఓటరు నుంచి అర్జీని స్వీకరించారు. కార్యక్రమంలో సంగారెడ్డి తహసీల్దార్ దేవదాసు, బూత్‌లెవల్ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ వీరభద్రుడికి కార్తీకమాస పూజలు



జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం వీరన్నగూడెంలోని శైవక్షేత్రం భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శివనాగులు వీరభద్రస్వామికి రుద్రాభిషేకం, కుంకుమార్చన, సామూహిక సత్యనారాయణ వ్రతాల వంటి ప్రత్యేక పూజలు చేశారు. కార్తీకమాస ఆఖరి ఆదివారం కావడంతో భక్తులరద్దీతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ శశిధర్, పర్యవేక్షకులు సోమయ్య ఉన్నారు.

◆ మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



సంగారెడ్డి జోన్: పట్టణంలో అయ్యప్పస్వామి మహా పడిపూజను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆదివారం బ్యాంకుకాలనీలోని అపార్ట్‌మెంట్‌లో డాక్టర్ మహేశ్ కుమార్ నివాసంలో పడిపూజను నిర్వహించారు. అయ్యప్ప నామస్మరణతో కాలనీ పరిసరాలు మార్మోగాయి. పట్టణంతో పాటు సదాశివపేట, పెద్ద శంకరంపేట, నిజాంపేట తదితర ప్రాంతాల నుంచి అయ్యప్ప మాలధార భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భజనలు ఆటపాటలతో పూజలు చేశారు.